క్లుప్తంగా

జయప్రదం చేయండి


మాట్లాడుతున్న అఖిలపక్ష సంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం నిర్వహించే రాస్తారోకోను జయప్రదం చేయాలని అఖిలపక్ష నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి పిలుపుమేరకు బుధవారం ఉదయం 10గంటలకు స్థానిక నేతాజీ సర్కిల్‌లో రాస్తారోకోను చేపడుతున్నట్టు తెలిపారు. లక్షలాది మందికి ఉపాధినిచ్చే విశాఖ ఉక్కు పరిశ్రమను రక్షించుకోవాలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాస్తారోకోలో ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ సాంబశివ, సీపీఎం రామాంజులు, సీఐటీయూ ఫయాజ్, జనసేన రామాశ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ చెన్నక్రిష్ణ, ఏఐటీయూసీ పుల్లయ్య, రైతుసంఘం నేత రంగారెడ్డిలు పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత


బియ్యంతోపాటు స్వాధీనం చేసుకున్న వాహనం

చిట్వేలి : చిట్వేలి అంబేద్కర్ సర్కిల్ వద్ద మంగళవారం అక్రమంగా రవాణా చేస్తున్న బియ్యాన్ని ఏపీ39 టీవై 5631 నెంబరు గల వాహనాన్ని పట్టుకొని స్థానిక రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రెడ్డప్ప తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు వాహనంతోపాటు అందులో తరలిస్తున్న 3.5 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో సిసి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రేమాలయంలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

రామాపురం : మండల పరిధిలోని బండపల్లె వద్ద ఉన్న ప్రేమాలయం వృద్ధాశ్రమంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో సాయి ఇంజనీరింగ్ విద్యాసంస్థల చైర్మన్ కేవీ సుబ్బయ్య పుట్టినరోజు సందర్భంగా కళాశాల సిబ్బంది ఆర్థిక సౌజన్యంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో హరీష్, చంద్ర, వినోద్‌కుమార్‌నాయక్, కళాశాల సిబ్బంది ప్రతాప్‌రావ్, సుబ్బారావు, మహేష్‌రెడ్డి, వృద్ధాశ్రమం మేనేజర్ సుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్విఘ్నంగా మహాభారత యజ్ఞం


హరికథను చెబుతున్న సీతాలక్ష్మి

రామాపురం : మండల కేంద్రంలో తలపెట్టిన మహాభారత యజ్ఞంలో భాగంగా మంగళవారం 10వ రోజు ఉదయం సుభద్ర కల్యాణం రాజసుయ యాగానికి చుట్టపక్కల గ్రామస్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తిలకించారు. డీఎంకే సీతాలక్ష్మి ఆధ్వర్యంలో హరికథ ప్రజలకు అర్థమయ్యే రీతిలో తెలియజేస్తుండటం అందర్నీ ఆకట్టుకుంది. రాత్రి చిత్రాంగద విలాసం సుభద్ర కల్యాణం మల్లినాయుడు వారిచే డ్రామా ప్రదర్శించారు. కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిలు పాల్గొన్నారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని సరస్వతిపల్లెకు చెందిన బాబు, అన్నయ్యలు ఏర్పాటు చేశారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ షరీఫ్

సంబేపల్లె : దేవరరాయి నల్లగంగమ్మ జాతరను 5వ తేదీ జరుగనున్న నేపథ్యంలో ఎస్‌ఐ షరీఫ్ మంగళవారం ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటున్న క్రమంలో ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేకంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాలు పార్కింగ్ ప్రాంతాలను గుర్తించారు. అంతేకాకుండా ఈ నెలలో మండలంలోని పలు గ్రామాలలో జరుగుతున్న తిరునాలపై ఆరాతీశారు. చాందనీబండ్లు కట్టి భక్తులు పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలియజేశారు.

మౌలిక సౌకర్యాలను పూర్తి చేయండి

- ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే జగనన్న ఆశయం
- ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


జగనన్న కాలనీ పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో అన్ని రకాల మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామని మంగళవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కేబుడుగుంటపల్లి, ఉర్లగడ్డపోడు వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీలను అధికారులతో కలిసి పరిశీలించారు. నియోజకవర్గలంలోని జగనన్న కాలనీలను అధునాతనంగా ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఉర్లగడ్డపోడు, బుడుగుంటపల్లి పంచాయతీలలో నిర్మిస్తున్న 392 గృహాలు, అభివృద్ధి, మౌలిక సౌకర్యాల పనులను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రతి పేదవాడిని ఇంటి యజమాని చేయాలనే లక్ష్యంతో జగనన్న కాలనీలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కూరగాయల మార్కెట్ ఆధునీకీకరణ

పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను పట్టణ సుందరీకరణలో భాగంగా నూతనంగా నిర్మించనున్నట్లు ప్రభుత్వవిప్ కొరముట్లశ్రీనివాసులు తెలిపారు. అలాగే మార్కెట్ పక్కన గిరిజమ్మ వీధిలోకి వెళ్లే దారిలో సీసీ రోడ్డు నిర్మిస్తామన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 60 సంవత్సరాల మార్కెట్ శిథిలావస్థకు చేరిందని అందువల్ల నూతనంగా అన్ని సౌకర్యాలతో మార్కెట్ నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ మండల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరక్టర్ సుధాకర్‌రాజు, పోకట సుబ్బరాయుడు, సర్పంచ్‌లు చంద్రశేఖర్, గోపి, ఎంపీటీసీలు ఆంజనేయులు, గని, కరీముల్లా, మహమ్మద్, హౌసింగ్ ఏఈ మురళి, బత్తల సుబ్రమణ్యం, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి


మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ అన్నారు. మంగళవారం కొర్లకుంట జాతీయ ఉపాధి హామీ పనులను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలన పేరుతో ఉపాధి హామీ కూలీలను ఇబ్బందులు గురిచేస్తుందని అన్నారు. కొత్త నిభందనలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. 300 రోజులు పనిదినాలు కల్పించాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 600 రూపాయలు కూలీని చెల్లించాలన్నారు. ఈ విషయాన్ని ఉపాధి హామీ ఏపీఓ వేంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మహిళా సమఖ్య నాయకురాలు పి.నరసమ్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల నాగేశ్వర్రావు, ఉపాధి హామీ మేట్లు టి.సుబ్బమ్మ, కూలీలు పాల్గొన్నారు.

ఈద్గా అభివృద్ధికి సహకరించండి


జడ్పీ చైర్మన్ ఆకేపాటిని సత్కరిస్తున్న మైనార్టీలు

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాసకాలనీలో మైనార్టీకి సంబంధించిన ఈద్గాకు సహకరించాలని గ్రామస్తులు మంగళవారం జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ మంగంపేట పునరావాస కాలనీలో మైనార్టీలకు సంబంధించిన ఈద్గా, స్మశానం అభివృద్ధి పనులను జరుగుతున్నాయని, సహకరించాలని ఆకేపాటి దృష్టికి తీసుకువెళ్లారు. ఇందుకు ఆయన వెంటనే స్పందించి ఈద్గాకు అవసరమైన మోటారు, బోరును ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు మైనార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైల్వేబోర్డు సభ్యులు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి, మైనార్టీ నాయకులు కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పరంగా నందలూరుకు ప్రాముఖ్యత


క్యాంపును ప్రారంభిస్తున్న ఖాజామోహిద్దీన్

నందలూరు(రాజంపేట) : వైఎస్సార్ జిల్లాలో నందలూరు సబ్‌సెంటర్ నిజంగా క్రికెట్ గ్యారేజీ అని క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ కో - ఆర్డినేటర్ ఖాజామోహిద్దీన్ అన్నారు. బుధవారం సాయంత్రం నందలూరు క్రీడా మైదానంలో సమ్మర్ కోచింగ్ స్పెషల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరు నుంచి రాష్ట్ర, జిల్లా స్థాయిలో రాణిస్తున్నారన్నారు. అందువల్లనే నందలూరుకు క్రికెట్ పరంగా ప్రాముఖ్యత పెరుగుతోందన్నారు. నందలూరు సబ్‌సెంటర్ పరిధిలో క్రమశిక్షణ, క్రికెట్ క్రీడలోని నైపుణ్యాలతో క్రీడాకారులు తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. క్రికెట్ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈనెల 15న అండర్ - 12 మ్యాచ్‌లు జరుగుతాయని, అందుల్లో చెన్నై తదితర రాష్ట్రాల జట్లు తలపడున్నాయన్నారు. సమ్మర్ క్యాంపులో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఏవైడీ - డీసీఓ ఖాజామోహిద్దీన్, కడప కోచ్ అబూబకర్, హెడ్ కోచ్ సయ్యద్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్‌ఖాన్ లోడీ, ట్రైనర్ శివకోటి, మెటీరియల్ ఇన్‌చార్జి మహమ్మది తదితరులు పాల్గొన్నారు. అనంతరం నెట్‌ప్రాక్టీస్, సిమెంట్ పిచ్, నెట్ కవరింగ్‌లను పరిశీలించారు. ఈ సమ్మర్ క్యాంపులో 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

11న ఆకేపాటి ఎస్టేట్‌లో కంటి వైద్య శిబిరం


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

రాజంపేట రూరల్ : ఈనెల 11వ తేదీ గురువారం ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, గుంతకల్ డీఆర్‌యూసీసీ మెంబరు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డిలు తెలియజేశారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో మంగళవారం ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య ఆధ్వర్యంలో కడప భారతీ ఆస్పత్రి సౌజన్యంతో శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కంటి వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాల్గొనదలచిన వారు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, సెల్ నెంబరును తీసుకురావాలన్నారు. వివరాలకు 85006 15294, 99895 00740, 94409 72960 నెంబర్‌లను సంప్రదించాలన్నారు. కరపత్రాలు విడుదల చేసిన వారిలో కౌన్సిలర్‌లు ఆర్.రాఘవేంద్రవర్మ, ఎస్.న్యామతుల్లా, రాజా తదితరులు పాల్గొన్నారు.

గోదాం ఖాళీ చేయించడంలో రాజకీయం లేదు


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ గోదామును ఖాళీ చేయించడంలో ఎలాంటి రాజకీయం లేదని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అన్నారు. మంగళవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోదామును అద్దెకు ఇచ్చిన సమయం పూర్తి కావడంతో మార్కెట్‌యార్డు అధికారులు ఎన్నికల సామగ్రిని భద్రపరచుకునేందుకు రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. గోదామును ఖాళీచేయించడంపై ప్రతిపక్షపార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయ దురుద్దేశాలను ఆపాదించాలని చూడటం తగదన్నారు. వ్యాపారపరమైన విషయాలను రాజకీయంగా మార్చి విషప్రచారం చేయాలని చూసే వారి ఆటలు సాగనివ్వమన్నారు. రాయచోటిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేని ప్రతిపక్షపార్టీల నేతలు అధికారపార్టీపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు.

తారు రోడ్డు పనులు పూర్తి


పూర్తి అయిన రాయచోటి-అంగళ్లు రోడ్డు

కురబలకోట: జిల్లా కేంద్రం రాయచోటికి తారు రోడ్డు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రాయచోటి నుంచి అంగళ్లు కూడలి వరకు రూ. 316 కోట్ల వ్యయంతో డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. ఇప్పటికే తారు రోడ్డు పనులు పూర్తి కావడంతో వాహనదారులు కూడా రయ్..రయ్ మని దూసుకెళుతున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల వారు జిల్లా కేంద్రం రాయచోటి వెళ్లాలంటే ఇదే ప్రధాన మార్గం. వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును విస్తరించడం ఆపై దశాబ్దాల సమస్య తీరడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంజనేయుడికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని వెలసిన ఆంజనేయస్వామి ఆలయాలలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఉదయం నుంచి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్రనామాలతో అంజన్నకు ఆకుపూజ జరిపారు.

నేడు ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనం ప్రారంభం

రాయచోటి అర్బన్ : మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ మల్‌రెడ్డి తెలిపారు. నూతనంగా నిర్మించిన భవనాన్ని ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులతోపాటు జెడ్పీటీసీ, ఎంపీపీ, పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు, సర్పంచులు హాజరు కావాలంటూ ఆయన కోరారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

సిద్దవటం : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమవుతుందని సిద్దవటం గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, గణితం, పెయింటింగ్, బొమ్మలు తయారుచేయుట, పుస్తకాలపై సమీక్ష, పుస్తకాలు చదవడం, కథలు చెప్పడం తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ సమ్మర్ క్యాంపునకు పాఠశాల విద్యార్థులు 10 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులు పాల్గొనాలని తెలియజేశారు. సమ్మర్ క్యాంపు 40 రోజుల పాటు ఉంటుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను ఈ క్యాంపునకు పంపించి పేర్లను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

11 నుంచి క్రికెట్ టోర్నమెంట్

నందలూరు(రాజంపేట) : ఈనెల 11న నందలూరు క్రీడా మైదానంలో ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు జిల్లానేత పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ఆర్గనైజర్ ముమ్మడిశెట్టి సుధాకర్ బుధవారం తెలిపారు. ఈనెల 8వతేదీలోపు రూ.1200 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. 9866015602, 8309199305, 7674831452, 9676334033 నంబర్లను సంప్రదించాలన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50,116, రెండవ బహుమతి రూ.30,116లను అందిస్తామన్నారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు ఉంటుందన్నారు. మ్యాచ్‌లన్ని నాకౌట్ పద్ధతిలో జరుగుతాయన్నారు.

శేష వాహనంపై వెంకటేశ్వరుడు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వెంకటేశ్వర స్వామి పెద్ద శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగారు. స్థానిక శేష్‌మహల్ ఏరియాకు చెందినవారు ఉభయదారులుగా వ్యవహరించారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం అర్చకులు గోవర్ధన్‌భట్టార్ స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బండమీ దకమ్మపల్లె వాసులు ఉభయదారులుగా, హంసవాహనంపై స్వామి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, ఆలయ కమిటీ మాజీ సభ్యులు పాల్గొన్నారు.

600 లీటర్ల సారా ఊట ధ్వంసం

పీలేరు రూరల్ : తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని మద్రిమాకులపల్లె తండా పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా బట్టీలు గుర్తించి సారా తయారీకి సిద్ధం చేసిన ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో అర్బన్ పీఎస్ సిబ్బంది, రాయచోటి డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

వాల్మీకిపురం : ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ బస్టాండ్‌లో ఎర్ర జెండాను ఆవిష్కరించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు ఐక్యంగా ఉండాలని, అందరూ లైసెన్సు తీసుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లందరికీ వాహన మిత్ర పథకం ద్వారా రూ.10వేలు ఇవ్వాలని, డ్రైవర్లకు ఇబ్బంది లేకుండా 21 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు


స్వామి వారి మూలవిరాట్

చిన్నమండెం : మండెం లక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను నేటి నుంచి నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 9వ తేదీల వరకు శ్రీ మండెం లక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పలు పూజాదిక్రతువులను చేయనున్నట్లు వారు తెలియజేశారు.

సిద్దవటం : పెంచల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం (మే 3న) ప్రారంభమవుతున్నట్లు ఆలయ ప్రధాన కార్యదర్శి పాలెం చిన్నసుబ్బరాయుడు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన సిద్దవటంలో విలేకరులతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి గణపతి పూజతో పాటు వివిధ రకాల అభిషేకాలు, హోమాలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలియజేశారు. 4వ తేదీన విశేష పూజా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. రాత్రి ఒంటిమిట్ట రాజశేఖర్ కోలాటం, చెక్కభజనలు ఉంటాయన్నారు. 5వ తేదీన తెల్లవారు జామున గరుడ సేవ, సుదర్శన హోమం, అనంతరం లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం చేయనున్నామని చెప్పారు.

క్రిస్టియన్ మైనార్టీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


రాయచోటిలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న క్రిస్టియన్లు


విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట

రాయచోటి టౌన్ : క్రిస్టియన్ మైనార్టీల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. మంగళవారం అన్నమయ్య జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సంఘం అధ్యక్షుడు నిరంజన్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ మీ సమస్యలు పరిష్కస్తానని హామీ ఇచ్చారు. అనంతరం క్రిస్టియన్ సంఘం సభ్యులు ఎమ్మెల్యేని సన్మానించారు. కార్యక్రమంలో పాస్టర్స్ సిల్లోఫిస్ జై, వై.రత్నం, ఏసుదాసు, జయరాజు, విజయకుమార్, అబ్రహామ్, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఎంపీ గురుమూర్తికి ఆహ్వానం

ఈ నెల 5వ తేదీ సంబేపల్లెలోని దేవరరాయి నల్లగంగమ్మ జాతరకు రావాలని తిరుపతి ఎంపీ గురుమూర్తికి రాయచోటి ఎమ్మెల్యే జి. శ్రీకాంత్‌రెడ్డి ఆహ్వానం పలికారు. ఎంపీ రాయచోటికి వచ్చిన సందర్భంగా ఆయనకు ఈ ఆహ్వానం పత్రికను అందజేశారు. ఆయనను ఆహ్వానించిన వారిలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు చిదంబరంరెడ్డి, మదనపల్లె పరిశీలకులు హబీబ్‌ఖాన్, సర్పంచ్ రఘునాథరెడ్డి, ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి, బీసీ సెల్ విజయభాస్కర్, ఫయాజ్ అహమ్మద్, చెరువు కింత అమరనాథరెడ్డి ఉన్నారు.

కార్యకర్తకు పరామర్శ

రామాపురం : మండల పరిధిలోని నల్లగుట్టపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న దువ్వూరి ఆంజనేయులును తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డిలు పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ

సంబేపల్లె : చౌడేశ్వరి దేవి ప్రజలను చల్లంగా చూడు తల్లి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రార్థించారు. మండల పరిధిలోని రెడ్డివారిపల్లె పంచాయతీ సీఎం కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో చౌడేశ్వరిదేవి విగ్రహప్రతిష్ఠలో భాగంగా మంగళవారం నిర్వహించిన చౌడేశ్వరిదేవి హోమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లె గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిదంబరంరెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాలవెంకటరమణ, నాయకులు వడ్డివెంకట్రమణారెడ్డి, యువరాజునాయుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మిరప సాగు.. లాభాలు బాగు


మిరపకాయలను సేకరిస్తున్న మహిళా రైతు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని పలు గ్రామాలలో చిన్న రైతులు మిరప సాగు వల్ల ప్రతిరోజూ ఆదాయం గడిస్తున్నారు. కేసీ అగ్రహారం, శెట్టిగుంట, రెడ్డివారిపల్లి, రాఘవరాజపురం, బొజ్జవారిపల్లి తదితర గ్రామాల్లోని రైతులు మిరపను సాగు చేస్తున్నారు. అలాగే పలువురు అరటిలో అంతర్ పంటగా పండిస్తున్నారు. ఎక్కువ శాతం రైతులు డ్రిప్ ద్వారా మిరప పంట పండిస్తున్నారు. దీంతో మిరప మంచి దిగుబడి వస్తుంది. రెండు నెలల్లో వచ్చే ఈ పంటకు తెగుళ్ల, కలుపు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటే 15 రోజులకు ఒకసారి కోతకు వస్తుంది. ప్రస్తుతం రైతులు పచ్చి మిరపకాయలను మార్కెట్‌కు కేజీ రూ.40ల ధరతో ప్రతి నిత్యం అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారు. మంచి ధర పలుకుతుండంతో రైతులకు మంచి ఫలితాలు వస్తున్నాయి. ఇంకా చీడపీడల నుంచి పంటను కాపాడుకోగలిగితే మిరప పంట రెండు నెలలకు కాపు వచ్చి 195 రోజుల వరకు ఫలితాన్ని పొందవచ్చు.

చురుగ్గా శివాలయ నిర్మాణ పనులు


సాగుతున్న పునర్నిర్మాణ పనులు

పెనగలూరు : మండలంలోని ఈటమాపురం గ్రామం వద్ద శివాలయ పునర్నిర్మాణ ఆలయం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈటమాపురానికి చెందిన పారిశ్రామిక వేత్తలు బత్తిన తిరుపాల్ రెడ్డి, బత్తిన పెద్దగుండాల్ రెడ్డిల ఆధ్వర్యంలో శివాలయ నిర్మాణ పనులు మన్నూరు అమరనాథరెడ్డి దగ్గర ఉండి పనులు చేయిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా రూ. 60 లక్షలు నిధులు మంజూరయ్యాయి. అందుకు సంబంధించి మొదటగా రూ. 13 లక్షలు పెద్దగుండాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డిపాజిట్ చేశారు. శివాలయం పనులు దాదాపు 60శాతం పూర్తి అయినట్లు వారు తెలిపారు. వీలైనంత త్వరలో పూర్తిచేసి ఆలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

గాలివీటమ్మకు పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలను తీసుకొస్తున్న గాలివీటి కుటుంబసభ్యులు

గాలివీడు : గాలివీటమ్మకు ఈనెల 8, 9వ తేదిలలో జరగనున్న జాతర సందర్భంగా వీరబల్లి వాస్తవ్యులు, కీ.శే. మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు మంగళవారం నాలుగురోడ్ల కూడలి నుంచి మేళతాళాలతో అమ్మవారికి పట్టువస్త్రాలను ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. వారికి ముందుగా మండల వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, గ్రామస్తులు స్వాగతం పలికారు. అక్కడికి విచ్చేసిన భక్తులకు పప్పిరెడ్డి భారతి, ఉమా మహేశ్వరరెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

రెవెన్యూ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి


జిల్లా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రామ సచివాలయ మహిళా పోలీసులు

మదనపల్లె : గ్రామసచివాలయ మహిళా పోలీసులకు రెవెన్యూ, ఇతర విధుల నుంచి మినహాయింపు కల్పించాలని కోరుతూ జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావుకు మదనపల్లె మండల గ్రామ సచివాలయ మహిళా పోలీసులు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. మదనపల్లె పర్యటనలో భాగంగా డీఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఎస్పీని సచివాలయ మహిళా పోలీసులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా మహిళా పోలీసులు మాట్లాడుతూ.. తాము పోలీసులమైనా... మెడికల్, రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖలకు సంబంధించిన విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. ఆ శాఖల అధికారులు సిబ్బంది నుంచి ఒత్తిళ్లు, వేధింపులు ఎక్కువైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా ఉద్యోగరీత్యా తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీకి వివరించారు. దీనిపై స్పందించిన ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ మహిళా పోలీసుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు కేశప్ప, సుధాకర్, సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.